పెన్ పవర్
తెలంగాణ రౌండప్
గురువారం 27 నవంబర్ 2025 పేజీలు 8

# స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని గ్రామాల్లో పోటీ చేయాలి



హైదరాబాద్ పెన్ పవర్: స్థానిక సంస్థల ఎన్నికల బరిలో అన్ని గ్రామాల్లో పార్టీ అభ్యర్థులను రంగంలోకి దించి అత్యధిక స్థానాల్లో విజయం సాధించాలని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికలపై ఆయన అధ్యక్షతన బుధవారం దృశ్య మాధ్యమ సమావేశం జరిగింది. కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, రాజ్యసభ సభ్యుడు డా.కె.లక్ష్మణ్, భాజపా జాతీయ సంస్థాగత ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ తివారి, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్యే, ఎంపీలుగా పోటీ చేసిన అభ్యర్థులు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

-2 లో

# పార్టీపై ఇంకా నిర్ణయం తీసుకోలేదు..

- రాజకీయ పార్టీ ఏర్పాటుపై స్పందించిన కవిత
- పార్టీ ఎప్పుడైనా పెట్టవచ్చు... ప్రజల సమస్యలు తీర్చేలా ఉండాలన్న కవిత
- బీఆర్ఎస్ గురించి తాను మాట్లాడనని, బద్నాం చేస్తున్నారన్న కవిత




హైదరాబాద్ పెన్ పవర్:రాజకీయ పార్టీ ఏర్పాటుపై తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత స్పందించారు. పార్టీ ఏర్పాటుపై ఇంకా నిర్ణయం తీసుకోలేదని, అయితే మహిళల నుంచి పార్టీ పెట్టాలనే డిమాండ్ ఎక్కువగా వస్తోందని ఆమె అన్నారు. పార్టీ అనేది ఎప్పుడైనా పెట్టవచ్చు కానీ, ప్రజల సమస్యలు తీర్చేలా ఏ పార్టీ అయినా ఉండాలని వ్యాఖ్యానించారు. ఈరోజు మీడియాతో మాట్లాడుతూ, బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ ప్రభుత్వం మాట తప్పిందని విమర్శించారు. బీసీ రిజర్వేషన్లకు సంబంధించి నివేదిక ఇంత తప్పులతడకగా ఉంటే బీజేపీ ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. ఇక ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ గురించి తాను మాట్లాడనని, తాను మాట్లాడితే వారు బద్నాం చేస్తారని విమర్శించారు. జాగృతి నుంచి

-2 లో

# నేటి నుంచి పంచాయతీ ఎన్నికల నామినేషన్లు.. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ దిశానిర్దేశం

- కలెక్టర్లు, ఎస్పీలు, ఇతర జిల్లా ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్
- ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఎన్నికలు నిర్వహించాలని సూచన
- ఎన్నికల నియమావళిని పకడ్బందీగా అమలు చేయాలన్న ఎన్నికల కమిషనర్



హైదరాబాద్ పెన్ పవర్:గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని అధికారులకు దిశానిర్దేశం చేశారు. గ్రామ పంచాయతీ ఎన్నికలు ఎలాంటి లోటుపాట్లు లేకుండా నిర్వహించాలని ఆమె సూచించారు. కలెక్టర్లు, పోలీసు కమిషనర్లు, ఎస్పీలు, ఇతర జిల్లా ఉన్నతాధికారులతో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.
ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఎన్నికల నియామావళిని పకడ్బందీగా అమలు చేయాలని ఆమె అన్నారు. రేపటి నుంచి ప్రారంభమయ్యే నామినేషన్ల ప్రక్రియతో పాటు భద్రత, పోలింగ్ ఏర్పాట్లపై ఈ సందర్భంగా చర్చించారు. అదనపు డీజీ మహేశ్ భగవత్, పంచాయతీరాజ్ డైరెక్టర్ సృజన తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

-2 లో

# ఈశాన్య రాష్ట్రాలకు వైద్య సహకారం అందిస్తాం

హైదరాబాద్ పెన్ పవర్: ఈశాన్య రాష్ట్రాల ప్రజలకు ఎలాంటి వైద్య సహకారం కావాలన్నా అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. రాష్ట్ర అభివృద్ధిలో ఈశాన్య రాష్ట్రాల ప్రజలు భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో

-2 లో



పౌల్ట్రీ ఇండియా ప్రదర్శనలో మంత్రులు తుమ్మల, పొన్నం

# పౌల్ట్రీలో తెలంగాణ అగ్రస్థానం చేరాలి

హైదరాబాద్ పెన్ పవర్: పౌల్ట్రీరంగంలో తెలంగాణ దేశంలోనే అగ్రస్థానం పొందాలని రాష్ట్ర వ్యవసాయ, రవాణా శాఖల మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్ ఆకాంక్షించారు. హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీలో నిర్వహిస్తున్న పౌల్ట్రీఇండియా ప్రదర్శనలో బుధవారం వారు మాట్లాడుతూ... "దేశంలో, రాష్ట్రంలో ఉపాధి కల్పనలో కోళ్ల పరిశ్రమ కీలకపాత్ర పోషిస్తోంది. దీనికి ఉజ్వల భవిష్యత్ ఉంది. ఈ రంగంలోని రైతులు అధునాతన సాంకేతికతను వినియోగించి లబ్ధి పొందాలి. అవకాశాలను యువత అందిపుచ్చుకోవాలి. తెలంగాణ ప్రభుత్వం వ్యవసాయంతోపాటు దాని అనుబంధరంగాలను ప్రోత్సహిస్తోంది" అని తెలిపారు. కార్యక్రమంలో పౌల్ట్రీ ఇండియా అధ్యక్షుడు ఉదయ్ సింగ్ బయాస్, తెలంగాణ ఫెడరేషన్ అధ్యక్షుడు కె.మోహన్‌రెడ్డి, ప్రతినిధులు శ్రీకాంత్, చక్రధర్‌రావు, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ప్రదర్శన 28 వరకు ఉంటుందని ఉదయ్‌సింగ్ తెలిపారు.



## పార్టీపై ఇంకా నిర్ణయం తీసుకోలేదు..

- మొదటి పేజీ తరువాయి

మాత్రం తాము ఒక నిర్ణయానికి వచ్చామని, అత్యధిక గ్రామాల్లో బీసీలు నామినేషన్లు దాఖలు చేసేలా ప్రయత్నం చేస్తామని అన్నారు. ప్రతి గ్రామ పంచాయతీలో బీసీ అభ్యర్థులు గెలిచేలా తమ వంతు ప్రయత్నం చేస్తామని అన్నారు.

బీసీ జేఏసీ, బీసీ హక్కుల కోసం పోరాడేవారి కార్యక్రమాల్లో తాము పాల్గొంటామని అన్నారు. గ్రామాల్లో కాంగ్రెస్ గద్దెలు ఉన్నంత కాలం బీసీలకు అన్యాయం జరుగుతుందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రజలు, పార్టీలు మేల్కొనాలని సూచించారు. స్థానిక ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు తగ్గడానికి మంత్రులు, కాంగ్రెస్ ఎమ్మెల్యేలే కారణమని ఆమె ఆరోపించారు. బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ పార్టీకి ఏమాత్రం చిత్తశుద్ధి లేదని విమర్శించారు.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని గ్రామాల్లో పోటీ చేయాలి

- మొదటి పేజీ తరువాయి

రాంచందర్‌రావు మాట్లాడుతూ..అన్ని గ్రామాల్లో పోటీ చేసే అభ్యర్థులకు పార్టీ శ్రేణులు బలమైన మద్దతు అందించి, అత్యధిక స్థానాల్లో గెలిపించాలి. గ్రామాల అభివృద్ధికి నిధులిస్తుంది కేంద్ర ప్రభుత్వమే. ఈ విషయాలను ప్రజలకు వివరించాలి' అని రామచందర్‌రావు పేర్కొన్నారు.

## ఈశాన్య రాష్ట్రాలకు వైద్య సహకారం అందిస్తాం

- మొదటి పేజీ తరువాయి

'తెలంగాణ-నార్త్ ఈస్ట్ కనెక్ట్' కార్యక్రమంలో భాగంగా బుధవారం జరిగిన ఆరోగ్య సదస్సులో మంత్రి పాల్గొని మాట్లాడారు. "రాష్ట్రంలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన వైద్యాన్ని అందించడానికి మల్టీస్పెషాలిటీ ఆసుపత్రులను నిర్మిస్తున్నాం. హైదరాబాద్‌లో మూడు టిమ్స్, ఉస్మానియా కొత్త ఆసుపత్రితో పాటు వరంగల్‌లో హెల్త్‌సిటీ నిర్మిస్తున్నాం. ప్రైవేటు, కార్పొరేట్ ఆసుపత్రుల్లో ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించేందుకు రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం అమలు చేస్తున్నాం. 1,800లకు పైగా వైద్య సేవలు, సర్జరీలు ఆరోగ్యశ్రీ కింద ఉచితంగా అందిస్తున్నాం. రాష్ట్రాలు వేరైనా మనమంతా భారత దేశ పౌరులం. ప్రజలు ఎవరైనా అనారోగ్యం, అత్యవసర ఆపద వచ్చినప్పుడు మెరుగైన వైద్య సేవలు పొందాలని చూస్తారు. ఈశాన్య రాష్ట్రాలతో తెలంగాణ బంధాన్ని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్న రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు కృతజ్ఞతలు" అని మంత్రి పేర్కొన్నారు.

# అయ్యప్ప మాల వేసుకునే వారికి నిబంధనలు.. బీజేపీ నేత చికోటి ప్రవీణ్ ఆగ్రహం



**హైదరాబాద్ పెన్ పవర్:** అయ్యప్ప మాల ధరించిన ఉద్యోగులు, ధరించాలనుకునే వారు సెలవులు పెట్టాలని పోలీసు శాఖ ఉన్నతాధికారులు సూచించడంపై బీజేపీ నేత చికోటి ప్రవీణ్ స్పందించారు. అయ్యప్ప మాల ధరించిన కంచన్‌బాగ్ ఎస్సైకి డీసీపీ మెమో జారీ చేయడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. సెలవులు పెట్టి మాల ధరించాలని చెబుతున్నారని, మరి 40 రోజుల పాటు పోలీసులకు ప్రభుత్వం సెలవులు మంజూరు చేస్తుందా అని ఆయన ప్రశ్నించారు.

మెమోలో గడ్డం పెంచవద్దని, సాధారణ దుస్తుల్లో విధులకు హాజరు కావొద్దని పేర్కొనడం ఏమిటని ఆయన నిలదీశారు. మాలధారణ అనేది తరతరాలుగా వస్తున్న సంప్రదాయమని, దీనిని ఎలా విస్మరిస్తారని ప్రశ్నించారు. ఇతర మతస్తుల పండుగలకు సెలవులు ఇవ్వడంతో పాటు ప్రోత్సాహకాలు అందిస్తూ, పని గంటలు తగ్గిస్తారని ఆయన అన్నారు. హిందువుల పండుగలకే ఇలాంటి నిబంధనలు ఎందుకు విధిస్తారని ఆయన ప్రశ్నించారు.హిందువులు, అయ్యప్ప స్వాములు వీధుల్లోకి వస్తే పరిస్థితి వేరుగా ఉంటుందని ఆయన హెచ్చరించారు. శాంతిభద్రతలు పరిరక్షించాల్సిన పోలీసు శాఖలోనే ఇలాంటి పొరపాట్లు జరిగితే ఎలా అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వద్దనే పోలీస్ శాఖ ఉందని, పోలీసులకు ఆయన ఆదేశాలు జారీ చేయడం లేదా అని ఆయన అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే జోక్యం చేసుకుని తగిన చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో హిందూ వ్యతిరేకిగా మిగిలిపోతారని ఆయన హెచ్చరించారు.

# పల్లా రాజేశ్వర్ రెడ్డిని కాంగ్రెస్‌లోకి తీసుకువెళ్లడానికి ఒత్తిళ్లు వచ్చాయి: కేటీఆర్



**హైదరాబాద్ పెన్ పవర్:** జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డిని కాంగ్రెస్ పార్టీలోకి తీసుకువెళ్లడానికి ఎన్నో ఒత్తిళ్లు వచ్చినా, ఆయన మాత్రం తాను నమ్ముకున్న నాయకుడు కేసీఆర్ అని స్పష్టం చేశారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశంసించారు. జనగామ జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశంలో కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పల్లా రాజేశ్వర్ రెడ్డిది నిజమైన విధేయత, విశ్వాసమని కొనియాడారు. ఆయన విశ్వసనీయతకు నిదర్శనమని అన్నారు. రానున్న సర్పంచ్, భవిష్యత్తులో జరగబోయే జడ్పీటీసీ, ఎంపీటీసీ, మున్సిపాలిటీ ఎన్నికల్లో జనగామ జిల్లా ప్రజలు బీఆర్ఎస్‌కు పట్టం కడతారనే నమ్మకం తనకు ఉందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కొంతమంది నాయకులు పార్టీలు మారుతూ మోసం చేస్తున్నారని ఆయన విమర్శించారు. నిజమైన బలం ఉంటే రాజీనామా చేసి మళ్లీ ఎన్నికల్లో నిలబడాలని సవాల్ విసిరారు. పార్టీ మారిన వారు ఉప ఎన్నికలకు వెళితే వారి బలం ఏమిటో తెలిసిపోతుందని వ్యాఖ్యానించారు. 2001 నుంచి 2023 వరకు జనగామా, స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గాల ప్రజలు కేసీఆర్ వెంటే ఉన్నారని పల్లా రాజేశ్వర్ రెడ్డి అన్నారు. ఎన్నిక ఏదైనా సరే ప్రతి నాయకుడు, కార్యకర్త కథానాయకుడు కావాలని అన్నారు. వచ్చే ప్రతి ఎన్నికల్లో గులాబీ జెండా ఎగరాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, మాజీ ఎమ్మెల్యే రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఆటో మీటర్ చార్జీలు పెంచాలి

**హైదరాబాద్ పెన్ పవర్:** మానవ హక్కుల కమిషన్ ఆదేశాల మేరకు ఆటో మీటర్ చార్జీలు వెంటనే పెంచాలని తెలంగాణ ఆటో మోటార్స్ డ్రైవర్స్ యూనియన్ డిమాండ్ చేసింది.

తిరుమలగిరిలోని ఆటో డ్రైవర్స్ యూనియన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివానంద్ మాట్లాడుతూ 11ఏళ్లలో బస్ చార్జీలు 6సార్లు, ప్రభుత్వ ఉద్యోగుల వేతనాలు 3సార్లు పెరిగాయని ఎమ్మెల్యేల జీతాలు ఒకేసారి మూడు వందల శాతం పెంచుకోవడం జరిగిందని తెలిపారు. కానీ ఆటో మీటర్ చార్జీలు ఈ 11ఏళ్లలో ఒక్క సారి కూడా పెరగలేదని పేర్కొన్నారు. వివిధ రూపాల్లో అనేక పర్యాయాలు ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లిన పెంచలేదని అన్నారు. ఇటీవల మానవ హక్కుల కమిషన్ లో పిర్యాదు చేయగా రాజ్యాంగంలోని ఆర్టికల్ 21ప్రకారం ఆటో డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలని తీర్పునిచ్చింది వెల్లడించారు. ఐతే దీనిని ఎన్నికల కోడ్ నేపథ్యంలో జనవరి లోనే అమలు చేసే అవకాశం ఉంటుందని, అనవసరంగా కొన్ని రాజకీయ ప్రేరేపిత సంఘాలు వాళ్లు తమ రాజకీయ ప్రయోజనాల కోసం రోడ్డు మీదకు తీసుకు వస్తారు. ధర్నాలు చేయిస్తారు, లాఠీ చార్జి చేయిస్తారు అనవసరంగా ఆటో డ్రైవర్లు నష్టపోతారని వెల్లడించారు. కాబట్టి వారి మాటలు విని మోస పోవద్దని ఆటో డ్రైవర్లకు విజ్ఞప్తి చేసారు.

# పంచాయతీలో జాక్ పాట్..!

- ఒకే ఇంటికి కలిసోచ్చిన రిజర్వేషన్
- సర్పంచ్, వార్డు సభ్యుల పోటీకి చాన్స్
- వికారాబాద్ జిల్లా తాండూరు నియోజకవర్గంలో ఆసక్తికరం



**హైదరాబాద్ పెన్ పవర్:** తాండూరు నియోజకవర్గంలో పంచాయతి రిజర్వేషన్ ఓ కుటుంబానికి కలిసొచ్చింది. ఒకే ఇంటిలో సర్పంచ్ పదవితో పాటు వార్డు సభ్యుల స్థానాలకు పోటీ చేసే అవకాశం దక్కింది. ఈ సంఘటన వికారాబాద్ జిల్లా తాండూరు నియోజకవర్గంలో ఆసక్తికరంగా మారింది. బషీరాబాద్ మండలం మంతన్ గౌడ్ గ్రామానికి పంచాయతి ఎన్నికల్లో భాగంగా సర్పంచ్ స్థానం ఎస్టీ జనరల్కు రిజర్వ్ అయ్యింది. దీంతో పాటు రెండు వార్డులు ఎస్టీ జనరల్, ఎస్టీ మహిళకు రిజర్వేషన్ అయ్యింది. గ్రామం లో 494 మంది ఓటర్లు, 8 వార్డులు ఉన్నాయి.

అయితే గ్రామంలో ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన ఎరుకలి భీమప్ప కుటుంబం ఒక్కటే ఉంది. దీంతో సర్పంచ్ పదవితోపాటు ఎస్టీ(జనరల్), ఎస్టీ(మహిళ) వార్డు స్థానాలు కూడా ఆ కుటుంబంలోని ముగ్గురికి దక్కబోతున్నాయి. ఎరుకలి భీమప్ప తన భార్య వెంకటమ్మతో కలిసి గ్రామంలో బుట్టలు అల్లుతూ జీవనం సాగిస్తున్నాడు. ఆయన ఇద్దరు కొడుకులు ఎల్లప్ప, మహేశ్, కోడళ్లు స్వప్న, సుజాత పిల్లలతో నగరంలోని చందానగర్ లో ఆటోలు నడుపుతున్నారు. పంచాయతీ ఎన్నికలు వారి కుటుంబ పరిస్థితులను మార్చబోతున్నాయి. ఈ ఆసక్తికర ఘటన చర్చనీయాంశమైంది. దీని పై ఎరుకలి భీమప్ప భార్య వెంకటమ్మ మాట్లాడుతూ.. ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేమని గ్రామ పెద్దలతో చర్చించిన అనంతరం నిర్ణయం తీసుకుంటామని అన్నారు.

# బి ఆర్ ఎస్, కాంగ్రెస్ కు ధీటుగా ఉన్నది ప్రజా శాంతి పార్టీ మాత్రమే

**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ రాష్ట్ర పరిస్థితి ఘోరంగా ఉంది. లక్షల కోట్ల విలువైన భూములు అమ్ముకుని బినామీ లకు అంటగడుతున్నారని ప్రతిపక్షాలు గగ్గోలు పెడుతున్నాయి. ఇప్పుడు ఇన్వెస్ట్మెంట్ సమ్మిట్ అని చెప్పి డబ్బులు దండుకుంటున్నారని ఆరోపణలు వస్తున్నాయని ప్రజాశాంతి పార్టీ నేత కే ఏ పాల్ అన్నారు. బి ఆర్ ఎస్, కాంగ్రెస్ కు ధీటుగా ఉన్నది ప్రజా శాంతి పార్టీ మాత్రమే. జూబ్లీహిల్స్ లో ఓట్లు చీలవద్దని, రాష్ట్రాన్ని అభివృద్ధి చేద్దాం అన్న కాంగ్రెస్ సీనియర్ నేత మల్లు రవి అభ్యర్థన మేరకే ప్రజా శాంతి పార్టీ పోటీ చెయ్యలేదు. ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన గ్యారంటీ లను ఒక్కటి కూడా నెరవేర్చలేదు. కాంగ్రెస్ ప్రజలకు చెప్పిన ఒక్క హామీ కూడా తీర్చలేదు. మూడు రోజుల్లో నా భవిష్యత్ ప్రణాళిక ఉంటుందని అన్నారు. భట్టి ని ముఖ్యమంత్రి చెయ్యడానికి రెడ్డి నేతలు అందరు కలిస్తే రేవంత్ కు నేను మద్దత్తు ఇచ్చాను. తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి చేద్దాం అనుకుంటే భూములు అన్నీ అమ్మి పడేస్తున్నారు. రాష్ట్రంలో ఉన్న నిరుద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు, బీసీ నాయకులు అందరినీ ఏకతాటి పైకి తీసుకొని వస్తాను. బీజేపీ కి డిపాజిట్ రాని అభ్యర్థిని జూబ్లీహిల్స్ లో ఎందుకు పోటీలో నిలిపారు. కాంగ్రెస్ బీహార్ లో ఓటు చోరీ అంటున్నారు. మరి జూబ్లీహిల్స్ లో ఓటు చోరీ జరగలేదా?? మహారాష్ట్ర లో ఏక్ నాధ్ షిండే మాదిరిగా తెలంగాణ లో పరిస్థితి తయారయ్యింది. చాలా మీడియా సంస్థలు అమ్ముడు పోతున్నాయని అన్నారు. తెలంగాణ లో ఉన్న అందరు సర్పంచ్ అభ్యర్థులకు ప్రజా శాంతి పార్టీ ఆహ్వానం పలుకుతుంది. ఎన్నికల ముందు అన్నిసార్లు కాల్ చేసిన మల్లు రవి ఎన్నికల తరువాత మొఖం చాటేశారు. జూబ్లీహిల్స్ లో మాకు గెలిచే సత్తా ఉన్నా మేం పోటీ చెయ్యక మార్పు కోసం మిగతా వారికి అవకాశం ఇచ్చాం. షర్మిల, ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్ లు రోజు కాంగ్రెస్, బి ఆర్ ఎస్ పార్టీ లను తిట్టి మళ్ళీ అదే పార్టీ లో కలిశారు. మేము అలా కాదు. రాష్ట్రం అభివృద్ధి కోసం మాతో రేవంత్ రెడ్డి కలిసి పని చేద్దాం అంటే నేను సిద్దమే నని అన్నారు. ఖైరతాబాద్ లో తప్పకుండా త్వరలో ఉప ఎన్నికలు వస్తున్నాయి. ప్రభుత్వం మారక పోతే ఖైరతాబాద్, స్టేషన్ ఘన్ పూర్ లో ప్రజా శాంతి పార్టీ పోటీ చేస్తుందని వెల్లడించారు.

# ఘనంగా జనప్రియ 40 ఏళ్ల వేడుకలు

**హైదరాబాద్ పెన్ పవర్:** రియల్ ఎస్టేట్ రంగంలో సంచలనాలు సృష్టిస్తూ.. నమ్మకమైన సేవలకు కేరాఫ్ గా నిలుస్తున్న జనప్రియ గ్రూప్ మరో మైలురాయిని అధిగమించింది. ఈ విభాగంలో 40 ఏళ్లు పూర్తి చేసుకుని చరిత్ర సృష్టించింది. అలాగే 40 వేల ఫ్లాట్లు నిర్మించి నూతన అధ్యాయాన్ని లిఖించింది. ఈ సందర్భంగా హైదరాబాద్ జూబ్లీహిల్స్ లోని జేఆర్సీ కన్వెన్షన్ లో వేడుకలను గ్రాండ్ గా నిర్వహించారు. అలాగే జనప్రియ అప్ స్కేల్ ఛైర్మన్ %డ% ఫౌండర్ కె. రవీందర్ రెడ్డి 72వ బర్త్ డే సెలబ్రేషన్స్ ను అట్టహాసంగా జరిపారు. ఇందులో ప్రముఖ సింగర్ రేవంత్ పాల్గొని తన మెస్మరైజింగ్ పర్ఫామెన్స్ తో అదరగొట్టారు. జనప్రియ ప్రతినిధులు, సిబ్బంది, సన్నిహితులు, బిల్డర్లు ఈ మెమురబుల్ ఈవెంట్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జనప్రియ అప్ స్కేల్ మేనేజింగ్ డైరెక్టర్ కె క్రాంతి కిరణ్ రెడ్డి మాట్లాడుతూ.. తమ సంస్థ ఇలాంటి ఉన్నత స్థాయికి చేరుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. 40 ఏళ్లుగా ఎన్నో ఆర్థికపరమైన సవాళ్లు, రాజకీయ మార్పులను తట్టుకుని.. విల్ పవర్ తో ఇంత ఎత్తుకు ఎదిగినట్టు తెలిపారు. జనప్రియ అప్ స్కేల్ అయ్యేందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. తన తండ్రి, మెంటర్ అయిన రవీందర్ రెడ్డి.. ఈ సంస్థకు బలమైన పునాది వేసి విజయవంతంగా ముందుకు నడిపించారని కొనియాడారు. రాబోయే రోజుల్లో జనప్రియ.. మరిన్ని అద్భుతమైన ప్రాజెక్టులు చేపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# రాజ్యాంగాన్ని రక్షించాలి

## మాజీ రాజ్యసభ సభ్యుడు వి హనుమంతరావు




**హైదరాబాద్ పెన్ పవర్:** కేంద్ర ప్రభుత్వం బాబాసాహెబ్ అంబేద్కర్ ను అవమానిస్తుందని ఆయన తెలిపారు. రాజ్యాంగం అమలు పరిచిన దినోత్సవం సందర్భంగా అంబర్పేట్ శ్రీ రమణ చౌరస్తా లోగల డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహం వద్ద సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ హనుమంతరావు పాల్గొని డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విహెచ్ మాట్లాడుతూ రాజ్యాంగం రాసిన అంబేద్కర్ను యువత ఆదర్శంగా తీసుకోవాలని ఆయనను మర్చిపోవద్దని ఆయన గుర్తు చేశారు. పార్లమెంట్లో అమిత్ షా అంబేద్కర్ను అవహేళన చేస్తూ మాట్లాడారని అది సరైన పద్ధతి కాదని ఆయన తెలిపారు

# ట్యాంక్ బండ్ పరిసరాల్లో భారీగా ట్రాఫిక్ జామ్

**హైదరాబాద్ పెన్ పవర్:** రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 46 ను రద్దు చేసి , బిసిలకు 42 శాతంతో ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేస్తూ ట్యాంక్ బండ్ అంబేద్కర్ విగ్రహం ముందు రోడ్డుపై బిసి సంఘం నాయకులు బైటాయించారు. దీంతో ట్యాంక్ బండ్ నుండి హిమాయత్ నగర్ లిబర్టీ చౌరస్తా వైపు వెళ్లే వాహనాలు నిలిచిపోయాయి. ఆందోళన చేస్తున్న బిసి సంఘ నాయకులతో వాహనదారులు ఘర్షణకు దిగారు. వాహనాలు కిలోమీటర్ మేర నిలిచిపోయాయి. పోలీసుల జోక్యంతో బిసి సంఘం నాయకులు ఆందోళన విరమించారు.

# ఐస్ బెర్గ్ ఆర్గానిక్ ఔట్ లెట్ ప్రారంభం

**హైదరాబాద్ పెన్ పవర్:** ఐస్బర్గ్ ఆర్గానిక్ ఐస్క్రీమ్స్ హైదరాబాద్లోని ఎ.ఎస్ రావు నగర్ లో కొత్త ఔట్లెట్ ను ఏర్పాటు చేసింది. దీనిని సీనియర్ నటుడు తనికెళ్ళ భరణి ప్రారంభించారు. హైదరాబాద్లో రాబోయే 2, 3 నెలల్లో మరిన్ని స్టోర్లు మొదలు పెడతామని కంపెనీ ఫౌండర్ సుహాస్ చెప్పారు. విజయవాడలో కూడా బ్రాంచ్ స్టార్ట్ చేస్తామని, సౌత్ ఇండియా మొత్తం విస్తరించే ప్రణాళికతో ఉన్నట్టు తెలిపారు. ఐస్బర్గ్ ఆర్గానిక్ ఐస్క్రీమ్స్ 2013 నుంచి ఆర్గానిక్ ఐస్ క్రీం ఇండస్ట్రీలో అగ్రగామిగా కొనసాగుతోందని, 2018లో పూర్తిగా ఆర్గానిక్ విధానంలోకి మారామని కంపెనీ ఓ స్టేట్మెంట్లో పేర్కొంది. ఏ2 దేశీ ఆవు పాలు, ఆర్గానిక్ యెల్లో బటర్, తీపి పదార్థాలైన ధాగా మిశ్రీ, కొకనట్ షుగర్, బెల్లం వంటిని ఉపయోగిస్తున్నామని తెలిపింది.

# బీసీల ప్రయోజనాలను బలి చేయొద్దు

**హైదరాబాద్ పెన్ పవర్:**మొండి వైఖరికి నిరసనగా రాష్ట్ర,కేంద్ర ప్రభుత్వాల దిష్టిబొమ్మలను దహనం చేస్తున్నామని దాసరి ఉష స్పష్టం చేశారు. ప్రజాస్వా మ్యబద్ధంగా బీసీల ఓట్లతో గెలిచిన ప్రభుత్వాలు తమ మొండితనాన్ని వీడి,తక్షణమే రద్దు చేసిన జీవో 9ని మళ్లీ అమలు చేయాలని,బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు వెంటనే కల్పించాలని

ఆమె డిమాండ్ చేశారు. బీసీలకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని, లేనిపక్షంలో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని ఆమె హెచ్చరించారు. ఈ కార్యక్రమం లో బీసీ జేఏసీ జిల్లా వర్కింగ్ చైర్మన్ నల్లవెల్లి శంకర్, వైస్ చైర్మన్ కొండి సతీష్, జిల్లా, మండల కన్వీనర్లు సలేంద్ర కొమ్రయ్య, భూమేష్, ఆసారి రాజయ్య యాదవ్, కన్న రమేష్ గౌడ్, తోట



రాజ్‌కుమా ర్, నోముల శ్రీధర్, భూమయ్య, కొండయ్య, అలువాల రాజేందర్, కలవేన రాజేందర్, అశోక్, రమేష్ తోపాటు తదితరులు పాల్గొన్నారు.

# పట్టు పట్టింది డాక్టరేట్ సాధించింది



## గండు స్రవంతిని అభినందించిన మాజీ ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి

**హైదరాబాద్ పెన్ పవర్:**
ఆమె పట్టు పట్టింది డాక్టరేట్ పట్టా పొందింది. ఎన్ని అవంతరాలు ఎదురైనా తన లక్ష్య సాధనలో ముందుకు సాగింది. పెద్దపల్లి పట్టణంలోని సుభాష్ నగర్ కు చెందిన గండు స్రవంతి 2006%-%10లో బీ పార్మసి, 2010-12లో ఎం ఫార్మసీని ట్రినిటీ ఫార్మసిటికల్ సైన్సెస్ కళాశాలలో పూర్తి చేసింది. తదనంతరం స్రవంతి హిమాయత్‌నగర్‌లోని చైతన్య యూనివర్సిటీలో పిహెచ్.డి పూర్తి చేయాగ ట్రినీటి ఎడ్యుకేషనల్ వ్యవస్థాపాకు లు, మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి అభినందనలు తెలిపారు. కాగా ఆమె చేసిన పరిశోధన శీర్షిక "బయోఎనాలి టికల్ మెథడ్ డెవలప్మెంట్ అండ్ వలిడేషన్ ఫర్ ది డిటేర్ మినేషన్ అఫ్ సమ్ సెలెక్టెడ్ ఆంటీ హైపర్టెన్సివ్ అండ్ ఆంటీ - వైరల్ డ్రగ్స్ అండ్ దేయిర్ ఫార్మసిటికల్ ఫార్ములేషన్స్ బై యూపీఎల్ సీ అండ్ ఎం ఎస్/ఎం ఎస్." ఈ మేరకు ఇటీవల నిర్వహించిన ప్రత్యేక కార్యక్ర మంలో పి. హెచ్. డి డిగ్రీని విశ్వవిద్యాలయ వీసీ, వ్యవస్థాపకులు పురుషోత్తమ్ రెడ్డి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడు తూ తన విజయం వెనుక తల్లిదండ్రులు గండు రంగన్న విజయ మద్దతు, ప్రోత్సాహం ఎంతో ఉందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ట్రినిటీ ఎడ్యుకేషనల్ఇన్స్టిట్యూషన్స్, ట్రినిటీ కాలేజ్ ఆఫ్ ఫార్మసీ, వ్యవస్థాపక ఛైర్మన్, మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి గండు స్రవంతితోపాటు ఆమె తల్లి తండ్రులు హృదయపూర్వ క అభినందనలు తెలిపారు.

గండు రంగన్న, విజయ దంపతులకు అభినందనలు తెలిపారు. ట్రినిటీ విద్యార్థులు ఉన్నత స్థానాలు సాధించడం సంస్థ గర్వకారణమని డా. గండు స్రవంతి చూపిన కృషి, నిబద్ధత ఫార్మసీ రంగంలో విద్యార్థులకు స్ఫూర్తిదాయక మని ఆయన ప్రశంసించారు. మరిన్ని విజయాలతో ముందుకు సాగాలని మాజీ ఎమ్మెల్యే అభినందించారు.

# ఉపాధి అవకాశాల కల్పన యాదవ ట్రస్టు లక్ష్యం

**హైదరాబాద్ పెన్ పవర్:**
జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలను కల్పించాలనే లక్ష్యంతో యాదవ చారిటబుల్ ట్రస్ట్ తొమ్మిదవ వార్షికోత్సవం సందర్భంగా ఈ నెల 28న పెద్దపల్లిలో మెగా ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు ట్రస్ట్ జిల్లా అధ్యక్షులు మారం తిరుపతి యాదవ్ తెలిపారు. పెద్దపల్లి ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ట్రస్ట్ సభ్యులతో కలిసి ఉద్యోగ మేళాకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మారం తిరుపతి యాదవ్ మాట్లాడుతూ సుమారు1000 మంది నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో దాదాపు18 కంపెనీలు ఈ మేళాలో పాల్గొంటాయని వివరించారు. ఈ కార్యక్రమం పెద్దపల్లి శాంతినగర్‌లోని సబ్-రిజిస్ట్రార్ కార్యాలయం భవన ఆవరణంలో ఉదయం 10 గంటల నుండి ఉద్యోగ నియామకాలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్న పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించనున్నారని తెలిపారు. ఈ జాబ్ మేళాను జిల్లాలోని అన్ని వర్గాల నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో ట్రస్ట్ నాయకులు బత్తిని లక్ష్మణ్ యాదవ్,మల్లెత్తుల నాగరాజు యాదవ్,తమ్మడ బోయిన ఓదెలు యాదవ్,సభ్యులు ఎలుక కొమరయ్య,తువ్వ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# డాక్టర్ అంబెడ్కర్ రాజ్యాంగ ధర్మకర్త



**హైదరాబాద్ పెన్ పవర్:**పంచాయతీ కార్యాలయం నందు బుధవారం సర్పంచ్ పాల్ దినకర్ ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. వారు మాట్లాడుతూ భారతదేశ ఖ్యాతిని ప్రపంచానికి చాటి చెప్పిన పవిత్ర గ్రంథం మన రాజ్యాంగం.. ఈ గొప్ప రాజ్యాంగం ఆమోదం పొంది నేటికీ 76 సం అని అన్నారు. దినోత్సవ వేడుకలు నేపథ్యంలో డా. బి ఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూల మాల వేసి అందరికీ రాజ్యాంగ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమం నందు పంచాయతీ కార్యదర్శి జి. ప్రకాశం మరియు జూనియర్ అసిస్టెంట్ నవీన్ కుమార్ మరియు విద్యుత్ సిబ్బంది గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మద్యం మత్తులో ఆర్టీసీ డ్రైవర్, కండక్టర్పై దాడి చేసిన పోకిరీలు

**హైదరాబాద్ పెన్ పవర్:**మద్యం మత్తులో ఆర్టీసీ డ్రైవర్, కండక్టర్పై ఇద్దరు మందుబాబులు దాడి చేసారు. నర్సంపేట కాంగ్రెస్ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి మా పెద్దనాన్న అంటూ ఆర్టీసీ సిబ్బందిపై దాడికి దిగారు. హైదరాబాద్ నుండి మహబూబాబాద్ వెళ్తున్న ఆర్టీసీ బస్సులో, వరంగల్ వద్ద ఇద్దరు మందు బాబులు బస్సు ఎక్కారు. నర్సంపేట వద్ద దిగాల్సి ఉండగా, దిగకపోవడంతో బస్సు ఆపి మద్యం మత్తులో నిద్రిస్తున్న వారిని కండక్టర్ లేపాడు. దీంతో నర్సంపేట కాంగ్రెస్ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి మా పెద్దనాన్న, మమ్మల్నే లేపుతావా అంటూ ఆర్టీసీ సిబ్బందిపై దాడికి పాల్పడ్డారు.

## అందరి ఆరాధ్య దైవం బాబాసాహెబ్ అంబేద్కర్.

**హైదరాబాద్ పెన్ పవర్:** అందరికీ ఆరాధ్య దైవం బాబాసాహెబ్ అంబేద్కర్ అని జూలపల్లి మాజీ సర్పంచ్ గొల్లపల్లి శంకర్ గౌడ్, బాబా సాహెబ్ అంబేద్కర్ అవార్డు గ్రహీత ఇరుగు రాళ్ల శ్రీనివాస్ అన్నారు. బుధవారం కమాన్ పూర్ మండలంలోనిజూలపల్లి గ్రామపంచాయతీ పరిధిలో గల ఆదర్శనగర్ లో భారత రాజ్యాంగం బాబాసాహెబ్ అంబేద్కర్ కు పూలమాలలు వేశారు. భారత రాజ్యాంగం పూర్తయి 76 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా బాబాసాహెబ్అంబేద్కర్ కు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేడు బాబాసాహెబ్ అంబేద్కర్ రచించిన భారత

రాజ్యాంగం వల్ల నేడు ప్రతి ఒక్కరికి హక్కులు కలుగుతున్నాయని అలాగేరిజర్వేషన్లు భారత రాజ్యాంగం వల్లనే కలుగుతున్నాయని అన్నారు. ఆయా మహానుభావుని రాజ్యాంగం వల్లనే ఎంపీలు ఎమ్మెల్యేలు తమ తమ రిజర్వేషన్లు పొందుతున్నారని పేర్కొన్నారు. ఆ మహానుభావునిఅడుగుజాడల్లో నడిచే బాధ్యత మన అందరిపై ఉందని అన్నారు. అంబేద్కర్ సంఘ రాష్ట్ర నాయకులు కుక్క చంద్రమౌళి, మాజీ ఎంపీటీసీ శివశంకర్, గ్రామ కార్యదర్శి అంబటి శంకర్, ఐఎన్టియుసి నాయకులు గునిగంటివెంకటస్వామి, ఎమ్మార్పీఎస్ మండల శాఖ అధ్యక్షుడు కల్లేపల్లి నర్సింగం, వివిధ పార్టీల నాయకులు రెబల్ రాజ్ కుమార్, బొమ్మగాని అనిల్ గౌడ్, ఆడెపు రమేష్, ఇరుగు రాళ్ల భాగ్యలక్ష్మి, తిరుపతి మధునయ్య, పోశం, ఓదెలు, సుధాకర్, రాయ మల్లు, వెంకటి తదితరులు పాల్గొన్నారు.

## దేశీయ ఉత్పత్తులను, మేకిన్ ఇండియాను ప్రోత్సహించండి..

**హైదరాబాద్ పెన్ పవర్:**జమ్మికుంటలో ఇంటింటా స్వదేశీ ప్రతి ఇంటా స్వదేశీ ప్రోగ్రాంలో గుజ్జ శ్రీనివాస్ రావు వ్యాఖ్యలు..
ఆత్మ నిర్భర భారత్ జిల్లా కార్యశాల సభాధ్యక్షులు, జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకట్ రెడ్డి, అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఉత్పత్తులకు బదులుగా దేశీయ ఉత్పత్తులను, మేకిన్ ఇండియాను ప్రోత్సహించినప్పుడే దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని , స్వదేశీ వస్తువులను కొనుగోలు చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని బిజెపి కౌన్సిలర్ నెంబర్ గుగ్గిళ్ళ రమేష్, అన్నారు. ఆత్మ నిర్వర్ భారత్ సంకల్ప అభియాన్ , ఇంటింటా స్వదేశీ ప్రతి ఇంటా స్వదేశీ కార్యక్రమం మంగళవారం రోజున జమ్మికుంట పట్టణంలో వర్క్ షాప్ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గుగ్గిళ్ళ రమేష్ మాట్లాడుతూ, ప్రధాని మోదీ నాయకత్వంలో భారత దేశం మేక్ ఇన్ ఇండియా,ఆత్మ నిర్భర్ భారత్ దిశగా అడుగులు వేసిందన్నారు. స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించి, స్థానిక పరిశ్రమలకు మద్దతు అందించడానికి మోడీ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందన్నారు. స్వదేశీ అవగాహన కార్యక్రమాలను నిర్వహించి , ప్రతి ఒక్కరు స్వదేశీ వస్తువులు కొనుగోలు చేసేలా చూడాలని కోరారు. మేక్ ఇన్ ఇండియా ఉత్పత్తుల వాడకం వల్ల దేశ ఆర్థిక వ్యవస్థ బలపడుతుందని, తద్వారా భారత్ అభివృద్ధి చెంది ఇతర దేశాలపై ఆధారపడకుండా ముందుకు వెళుతుందని తెలిపారు. ప్రతి ఇంటా స్వదేశీ ఇంటింటా స్వదేశీ ఇది కేవలం ఒక నినాదం కాదు మన దేశాన్ని స్వయం సమృద్ధి వైపు నడిపించే ఒక మంత్రం అని తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పిలుపుతో స్వదేశీ ఒక ప్రజా ఉద్యమంగా మారిందన్నారు. సెప్టెంబర్ 25న దీన్ దయాల్ ఉపాధ్యాయ జయంతి సందర్భంగా ప్రారంభమైన ఈ స్వదేశీ ప్రచార ఉద్యమం డిసెంబర్ 25 న భారతరత్న మాజీ ప్రధాని అటల్ బిహారి వాజ్ పాయి, జయంతి వరకు కొనసాగుతుందని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. కార్యక్రమంలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకటరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కరీంనగర్ మాజీ డిప్యూటీ మేయర్ గుగ్గిళ్ళపు రమేష్, ఆత్మనిర్భర భారత్ కో కన్వీనర్లు గుజ్జ శ్రీనివాస రావు, సింగిరెడ్డి కృష్ణారెడ్డి, రంగు భాస్కరాచారి, నరసింహారాజు, స్టేట్ కౌన్సిలర్ నెంబర్పుప్పాల రఘు, ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల రాజేందర్, జమ్మికుంట పట్టణ , మండల అధ్యక్షులు కొలకాని రాజు, సంపెల్లి సంపత్ రావు, గణేష్, రాజ్ కుమార్, విజయ్, షీలా జయ ప్రకాష్, కొండ్ల పాపయ్య, మరియు జిల్లాలోని అన్ని మండల అధ్యక్షులు, కోఆర్డినేటర్లు పాల్గొన్నారు..

## ఘనంగా న్యాయ దినోత్సవ ర్యాలీ

**హైదరాబాద్ పెన్ పవర్:**భారత రాజ్యాంగ దినోత్సవాన్ని హుజురాబాద్ కోర్టులో సబ్ జడ్జీ పి.బి.కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. న్యాయమూర్తులు, న్యాయవాదుల పెద్ద ఎత్తున ర్యాలీగా వెళ్లి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా సబ్ జడ్జీ మాట్లాడుతూ భారత రాజ్యాంగం అమలయ్యేలా చూడటం ప్రతీ ఒక్కరి బాధ్యత అన్నారు. అదే విధంగా హక్కులతో పాటు పౌరులందరూ బాధ్యతలను కూడా నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జీ పద్మ సాయి శ్రీ, బార్ అసోసియేషన్ అధ్యక్షులు, వై. అరుణ్ కుమార్, ఏజీపీ గుర్రం శ్రీనివాస్ గౌడ్,న్యాయవాదులు ముక్కెర రాజు,నల్ల భూంరెడ్డి, కేతిరి శ్రీనివాస్ రెడ్డి,బండి రవీందర్, కొత్తూరు రమేష్, మట్టెల తిరుపతి, శివరామకృష్ణ,భాగోతం కుమారస్వామి,ఎం. విక్రమ్,సిహెచ్ భానుకిరణ్, శ్రీరాం శిరీష,కోర్టు,పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# కొత్తపల్లి పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన పోలీస్ కమీషనర్ గౌష్ ఆలం

**హైదరాబాద్ పెన్ పవర్:**
కరీంనగర్ పోలీస్ కమీషనర్ గౌష్ ఆలం బుధవారం కరీంనగర్ కొత్తపల్లి పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కొత్తపల్లి ఇన్స్పెక్టర్ బిల్లా కోటేశ్వర్ కమీషనర్‌కు స్వాగతం పలికారు. కమీషనర్ సాయుధ దళ పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. కమీషనర్ గౌష్ ఆలం పోలీస్ స్టేషన్ సిబ్బంది పరేడ్‌ను, పరిసరాలను పరిశీలించారు. సిబ్బందికి అందించిన కిట్లను తనిఖీ చేసి, వాటిని సక్రమంగా వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణలోని స్వాధీనం చేసుకున్న వాహనాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. హాజరులో ఉన్న సిబ్బందితో మాట్లాడి, వారికి కేటాయించిన విధులు, రికార్డుల నిర్వహణ, సీసీటీఎన్ఎస్ లో నమోదైన కేసుల వివరాలను సక్రమంగా పొందుపరచాలని సూచించారు. తెలంగాణ రాష్ట్ర పోలీసులు వినియోగించే సీసీటీఎన్ఎస్ - 2.0, పిటిషన్ మేనేజ్‌మెంట్ సిస్టమ్, ఈ-సమన్ల జారీ, టీఎస్-కాప్, హెచ్ఆర్ఎంఎస్, ఈ-సాక్ష్య, టెక్ డాటం, ఐరాడ్ దర్పణ్, సీఈఐఆర్, సైబర్ క్రైమ్‌లో ఆర్థిక, ఆర్థికేతర నేరాలు, సీడీఆర్, పోర్టబుల్ ఫింగర్ ప్రింట్ డివైస్, బాడీ వార్న్ కెమెరాలు వంటి అన్ని రకాల సాఫ్ట్‌వేర్ అప్లికేషన్లపై పూర్తి స్థాయిలో పట్టు సాధించి, వాటిని రోజువారీ విధుల్లో విరివిగా వినియోగించాలని ఆదేశించారు. ఎఫ్.ఐ.ఆర్ ఇండెక్స్‌ను పరిశీలించి, పెండింగ్ కేసులపై సమీక్ష జరిపి, వాటిని త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. నమోదైన సైబర్ నేరాల



గురించి తెలుసుకొని, విజిబుల్ పోలీసింగ్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. కరీంనగర్ కొత్తపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని అన్ని వార్డులు, గ్రామాలను సెక్టార్లుగా, సబ్-సెక్టార్లుగా విభజించి, వాటికి గ్రామ పోలీస్ అధికారులను కేటాయించాలని ఆదేశించారు. నూతనంగా విధుల్లో చేరిన కానిస్టేబుళ్లకు పోలీస్ స్టేషన్‌లో అన్ని రకాల విధులను నేర్చుకోవాలని, రికార్డు నిర్వహణ, సీసీటీఎన్ఎస్, రిసెప్షన్, కోర్టు డ్యూటీ, డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు, బీట్, పెట్రోలింగ్, సమన్లు వంటి విధులను సీనియర్ల ద్వారా తెలుసుకోవాలని సూచించారు. నిజాయితీ, క్రమశిక్షణ, సమయపాలన తప్పనిసరని తెలిపారు. రౌడీ షీటర్లు, హిస్టరీ షీటర్లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, వారి కదలికలను ఎప్పటికప్పుడు గమనించాలని, ప్రతి నెలా వారికి సంబంధించిన నూతన సమాచారం ఎప్పటికప్పుడు సేకరించి నమోదు చేసుకోవాలని ఆదేశించారు. ఈ తనిఖీలో రికార్డుల మెయింటనెన్స్ , పోలీస్ స్టేషన్ పర్యవేక్షణ బాగుందని ఇన్స్పెక్టర్ బిల్లా కోటేశ్వర్ అతని సిబ్బందిని పోలీస్ కమిషనర్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ టౌన్ కొత్తపల్లి పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ బిల్లా కోటేశ్వర్ ఎస్సైలు సాంబమూర్తి, చీనా నాయక్ , సంజీవ్ తో పాటు ఇతర అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# జాతీయ పోటీలకు ఎంపికైనా పెద్దపెల్లి కరాటే క్రీడకారులు

**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణ రాష్ట్రం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్కూల్ గెమ్స్ ఆఫ్ ఫెడరల్
రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో పెద్దపల్లి జిల్లా కరాటే క్రీడకారులు అత్యంత ప్రతిభ కనబర్చారు. వికారాబాద్ జిల్లా కేంద్రంలో అండర్
14 విభాగంలో 23,24 తేదిల్లో జరిగిన రాష్ట్ర స్థాయి సెలెక్షన్ లో పెద్దపల్లి జిల్లా గోదావరిఖని పారిశ్రామిక ప్రాంతానికి చెందిన ఎం.ముక్తి శ్రీ, సునీహ సుల్తానా, పవన్ కుమార్ బంగారు పథకాలు సాధించారు. - 26హేమలత మహాజీ,- 20 బాలుర విభాగంలో బి శ్రీమన్ కాంస్య పతకం సాధించారు. డిసెంబర్ 14 నుండి 19 వరకు మధ్యప్రదేశ్ ఇండోర్ లో స్కూల్ గెమ్స్ ఫెడరేషన్ ఇండియా జాతీయ పోటీలకు ముగ్గురు క్రీడాకారులుఎంపికైయ్యారు. రాష్ట్ర స్థాయిలో బంగారు పథకాలు సాధించి



జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనా క్రీడాకారులను జపాన్ షటోరియో కరాటే స్కూల్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు తగరపు శంకర్, రాష్ట్ర కార్యదర్శి, ఏం రమేష్,కోశాధికారి, శ్రీనివాస్ యాదవ్ , జపాన్ సిటోరియో కరాటే స్కూల్ గౌరవ అధ్యక్షులు రాజ్ కుమార్ ,స్పందన క్లబ్ సెక్రటరీ డాక్టర్ కే నరేంద్ర సోనీ , స్పోర్ట్స్ కౌన్సిల్ సెక్రటరీ గణేష్ రాజ్, సీనియర్ ఇన్స్ట్రక్టర్స్ ఎస్ శ్రీనివాస్, బి
పరమేష్, శ్రావణ్ కుమార్ పటేల్, రోహిత్ కుమార్, నిదేశ్ కుమార్, శైలజ, సంజన, అభిజ్ఞ, శుభ శ్రీ, మరియు తల్లిదండ్రులు ప్రత్యేకమైన అభినందనలు తెలిపారు.

# వైకుంఠ ద్వార దర్శనం...పది రోజుల్లో 7 నుండి 8 లక్షల మంది భక్తులు దర్శనం చేసుకుంటారని అంచనా

**హైదరాబాద్ పెన్ పవర్:** వైకుంఠ ఏకాదశి దర్శనం డిసెంబర్ 30 నుండి జనవరి 8 వరకు జరుగుతుంది. డిసెంబర్ 30 నుండి జనవరి 1 వరకు ఆన్లైన్ ద్వారా బుక్ చేసుకున్న భక్తులకు మాత్రమే దర్శనం ఉంటుందని టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు అన్నారు.

జనవరి 2 నుండి జనవరి 8 వరకు ఏడు రోజుల పాటు సామాన్య భక్తులకు పెద్దపీట వేస్తాం. ఈ ఏడు రోజులు ఎవరైనా, ఎంతమందైనా వచ్చి దర్శనం చేసుకోవచ్చు, ఎలాంటి రిస్ట్రిక్షన్స్ లేవు. మొత్తం 182 గంటల సమయంలో, 164 గంటలు సామాన్య భక్తులకు కేటాయింపు వుంటుంది. ఎలక్ట్రానిక్ డిప్ ద్వారా దర్శన టోకెన్లు జారీ చేయబడతాయి. దీనిలో 1o3 విధానంలో టోకెన్లు జారీ చేస్తాం. నవంబర్ 27 ఉదయం 10 గంటల నుండి డిసెంబర్ 1వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు ఎలక్ట్రానిక్ డిప్ నమోదుకు అవకాశం. డిసెంబర్ 2వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు ఎలక్ట్రానిక్ డిప్ వివరాలు భక్తులకు అందుబాటులో ఉంచుతాం. మొదటి మూడు రోజులలో ఎస్సీడీ (శీఘ్ర దర్శనం), శ్రీవాణి టికెట్లు పూర్తిగా రద్దు చేసాం . జనవరి 2 నుండి జనవరి 8 వరకు, రోజుకు 15,000 ఎస్సీడీ (రూ. 300) టికెట్లు మరియు 1,000 శ్రీవాణి టికెట్లను ఆన్లైన్లో బుక్ చేసుకోవచ్చు. డిసెంబర్ 5 ఉదయం 10 గంటల నుండి ఈ టికెట్లు ఆన్లైన్లో అందుబాటులో ఉంటాయి. వైకుంఠ ద్వార దర్శనం రోజుల్లో తిరుపతిలో ఇచ్చే ఎస్సీడీ టోకెన్లు పూర్తిగా రద్దు చేయబడ్డాయి. ప్రోటోకాల్ ప్రముఖులు మినహా అన్ని వీఐపీ దర్శనాలు, ప్రత్యేక దర్శనాలు, ఆర్జిత సేవలు, చిన్నపిల్లలు–తల్లిదండ్రులు, వృద్ధులు, వికలాంగులు, డిఫెన్స్, ఎన్ఆర్ఐ దర్శనాలు ఈ 10 రోజులు రద్దు చేసామన్నారు. స్వయంగా వచ్చే ప్రోటోకాల్ ప్రముఖులకు మాత్రమే వీఐపీ దర్శనం వుంటుంది. సిఫార్సు లేఖలు స్వీకరించబడవు. దాతల దర్శనం ఆన్లైన్ అప్లికేషన్ ద్వారా బుకింగ్ చేసుకోవడానికి అవకాశం వుంది. జనవరి 6, 7, 8 తేదీల్లో తిరుపతి, రేణిగుంట, చంద్రగిరి వాసులకు రోజుకు 4,500, తిరుమల కొండపై ఉండేవారికి రోజుకు 500 చొప్పున రోజుకు 5,000 టోకెన్లు కేటాయింపు జరగనుంది. మొదటిసారిగా వాట్సప్ ద్వారా ఎలక్ట్రానిక్ డిప్ రిజిస్ట్రేషన్ చేసుకునే సౌకర్యం కల్పించాం. 9552300009 నెంబర్కు ముందుగా 'గోవిందా' లేదా 'హాయ్' అని మెసేజ్ చేయాలి. మొదటి మూడు రోజులు ఆన్లైన్ ద్వారానే దర్శనాలు, టికెట్ లేనివారు వచ్చి ఇబ్బంది పడకుండా ప్రయాణ ఏర్పాట్లు చేసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాం. ఈ 10 రోజుల్లో కనీసం 7 లక్షల నుండి 8 లక్షల మంది భక్తులు దర్శనం చేసుకుంటారని అంచనా. వైకుంఠ ద్వార దర్శనం డిసెంబర్ 29 అర్ధరాత్రి 12 గంటలకు, డిసెంబర్ 30 తెల్లవారుజామున ప్రారంభమవుతుందని అన్నారు.

# రాష్ట్రంలోని పత్తి రైతులకు పూర్తి భరోసా

## సీసీఐ నిబంధనల సడలింపులపై కేంద్రంతో చర్చలు వేగవంతం

**హైదరాబాద్ పెన్ పవర్:** పేరేచెర్ల, సత్తెనపల్లి సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాలను పరిశీలించి, రైతుల సమస్యలు తెలుసుకున్న మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుగుంటూరు %ఒ% పల్నాడు జిల్లాలు, నవంబర్ 26 రాష్ట్రంలోని పత్తి రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వారికి ప్రభుత్వం అండగా ఉంటుందని వ్యవసాయ శాఖ మంత్రి శ్రీ కింజరాపు అచ్చెన్నాయుడు గారు హామీ ఇచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా పత్తి రైతులకు ఎదురవుతున్న ఇబ్బందులను ప్రత్యక్షంగా తెలుసుకునేందుకు వ్యవసాయ శాఖ మంత్రి మంగళవారం పేరేచెర్ల, సత్తెనపల్లి లోని సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాలను స్వయంగా సందర్శించి, రైతుల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. పత్తి తేమశాతం నమోదుతో పాటు, కొనుగోలు విధానం, యాప్ సమస్యలు, %ూ%1 నుండి %ూ%4 గ్రేడింగ్ సమస్యలపై వివరంగా పరిశీలించారు. రైతులతో ముఖాముఖిగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకొని కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి పరిష్కారం చేస్తామని రైతులకు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ రైతులు ఎవరూ ఆందోళన చెందవద్దు. ప్రతి కిలో పత్తి కొనుగోలు అయ్యేలా ప్రభుత్వం పూర్తి బాధ్యత తీసుకుంటుంది అని స్పష్టం చేశారు. ఈ సంవత్సరం పత్తి రైతులకు పలు కష్టాలు వర్షాలు, దిగుబడి తగ్గడం, సీసీఐ కఠిన నిబంధనలు రూపంలో వచ్చాయని తెలిపారు. ఈ సంవత్సరం రాష్ట్రంలో 5 లక్షల 40 వేల ఎకరాల్లో పత్తి సాగు జరిగింది. దాదాపు 8 లక్షల క్వింటాళ్ల ఉత్పత్తి వచ్చే అవకాశం ఉన్నప్పటికీ అకస్మాత్తుగా కురిసిన వర్షాల వల్ల పత్తి నాణ్యత దెబ్బతింది. దిగుబడి తగ్గిన రైతులకు పైగా సీసీఐ అనేక కఠిన నిబంధనలు పెట్టడం వల్ల తీవ్ర ఇబ్బందులు పెరిగాయి. ముఖ్యంగా కొత్తగా అమలు చేస్తున్న %ూ1, ూ2, ూ3, ూ%4 గ్రేడింగ్ విధానం రైతులకు పెద్ద భారమవుతోంది. పంటే నష్టపోయింది%౫% దానిపై ఇంకా నిబంధనలు పెట్టడం సరైంది కాదు. రైతులకు అన్యాయం జరగకుండా అన్ని నియమాలను పునఃసమీక్షించాలని కొద్ది రోజుల క్రితమే కేంద్రాన్ని కోరామని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు.

### కేంద్ర ప్రభుత్వంతో చర్చలు, డిసెంబర్ 1 నుండి అదనపు కొనుగోలు కేంద్రాలు

కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుకి మంత్రి అచ్చెన్నాయుడు ఫోన్ లో రైతులు ఎదుర్కొంటున్న సమస్యల గురించి పూర్తిగా వివరించారు. కేంద్ర టెక్స్టైల్స్ మంత్రి, సీసీఐ చైర్మన్, ఎండీతో నేరుగా మాట్లాడి పత్తి కొనుగోలు నిబంధనల సడలింపులు చేయాలని కోరినట్టు వెల్లడించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూడా కేంద్రమంత్రి స్థాయిలో మాట్లాడి, ఒకసారి ప్రభుత్వం ఎంఎస్పీ ప్రకటించిన తర్వాత రైతుకు కొత్త నిబంధనలు పెట్టే అవకాశం ఉండకూడదు అంటూ స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినట్టు తెలిపారు. ప్రస్తుతం ఉన్న మిల్లులతో పాటు అదనంగా మరిన్ని మిల్లులు తక్షణం ఓపెన్ చేయండి అని సీసీఐ ఎండీకి కేంద్ర మంత్రి రామ్మోహన్ కోరడంతో కొనుగోలు వేగవంతానికి కేంద్రం అనుమతి ఇచ్చిందని, ప్రతిస్పందనగా సీసీఐ ఎండీ నుంచి డిసెంబర్ 1 నుంచి అన్ని మిల్లులు పూర్తిగా ఓపెన్ చేస్తాం అన్న హామీ ఇచ్చటినట్లు తెలిపారు. పేరేచెర్ల సెంటర్లో ఒక మిల్ అదనంగా, సత్తెనపల్లిలో అన్ని మిల్లులు పూర్తిగా ఓపెన్ కానున్నాయని వెల్లడించారు. ఈ సంవత్సరం తడిసిన పత్తి కారణంగా తేమ శాతం పెరగడంతో, 12% నుండి 18% వరకు తేమ ఉన్న పత్తిని కూడా సీసీఐ కొనుగోలు చేసేలా చర్యలు తీసుకుంటామని, రైతులు ఆందోళన పడాల్సిన అవసరం లేదు, ప్రతి రైతుకి న్యాయం జరుగుతుందనే పూర్తి హామీ ఇచ్చారు. పత్తి విక్రయం కోసం ఎవరూ ఇబ్బంది పడకుండా అన్ని శాఖలతో సమన్వయం చేస్తున్నారు. రైతులు కూడా నాణ్యమైన పంటలు పండించాలి, డిమాండ్ ఉన్న పంటల వైపు ముందుగా ప్రణాళికతో వెళ్లాలి అని సూచించారు.

# భద్రాద్రిలో ఘనంగా తూము లక్ష్మీనరసింహదాసు 235 వ జయంతి వేడుకలు

**భద్రాద్రి కొత్తగూడెం: పెన్ పవర్:**భద్రాద్రి ఆలయ అభివృద్ధికి విశేష కృషి చేసిన శ్రీ తూము లక్ష్మీనరసింహదాసు జయంతి వేడుకలు భద్రాద్రి రామయ్య సన్నిధిలో ఘనంగా నిర్వహించారు. రామ భక్తితో తన జీవితాన్ని త్యాగం చేసి భద్రాద్రి రామాలయాన్ని నిర్మించిన భక్త రామదాసు తో పాటు, తర్వాత కాలంలో ఆలయ అభివృద్ధికి కృషి చేసిన తూము లక్ష్మీ నరసింహ దాసు జయంతి వేడుకలు ప్రతి ఏట భద్రాద్రిలో వైభవంగా నిర్వహిస్తారు. గుంటూరు జిల్లా పొన్నూరు గ్రామానికి చెందిన శ్రీ తూము లక్ష్మీ నరసింహ దాసు ప్రభుత్వ ఉద్యోగి. తీర్థయాత్రలకు భద్రాద్రి ఆలయానికి వచ్చి ఆ కాలంలో భద్రాద్రి ఆలయం నిరాదరణకు గురైందని గుర్తించి ప్రభుత్వ ఉద్యోగాన్ని వదిలేసి ఆలయం వద్దనే ఉండి అభివృద్ధికి పాటుపడ్డారు. శ్రీరాముడి పై ఉన్న భక్తితో మళ్లీ ఆలయాన్ని అభివృద్ధి చేశారు. ఉదయం సుప్రభాత సేవ నుంచి సాయంత్రం వరకు జరిగే సేవలన్నీ ఒక పద్ధతి ప్రకారం చేసేలాగా రూప కల్పన చేశారు. శ్రీరాముని పై వున్న భక్తితో అనేక కీర్తనలను తెలుగులో రచించారు. ఆలయ అభివృద్ధికి కృషి చేసిన తూము లక్ష్మీ నరసింహ దాసు 235 వ జయంతి వేడుకలు భద్రాద్రి ఆలయంలో వైభవంగా నిర్వహిస్తున్నారు. ముందుగా అతని చిత్రపటంతో ఆలయ ప్రదక్షిణ చేసి గిరి ప్రదక్షిణ నిర్వహించారు. విస్తా కాంప్లెక్స్ వద్ద ఉన్న అతని విగ్రహానికి నూతన వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. తదుపరి చిత్రకూట మండపం వద్ద అతను రచించిన కీర్తనలను ఆలపిస్తూ వేడుకలు నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో తూము లక్ష్మీ నరసింహ దాసు వారసులు,ఆలయ ఈవో దామోదర్ రావు, అర్చకులు,పాల్గొన్నారు

# రామయ్యను దర్శించుకున్న సీవీ అనంద్

**హైదరాబాద్ పెన్ పవర్:** భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామివారినీ రాష్ట్ర హెూం శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సి వి ఆనంద్ కుటుంబ సమేతంగా దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆనంద్ కుమారుడి వివాహం భద్రాచలానికి చెందిన ప్రముఖ కాంగ్రెస్ పార్టీ నాయకుడు భోగాల శ్రీనివాసరెడ్డి కుమార్తె తో జరగనుంది.రెండు రోజుల పాటు భద్రాచలం లోనే ఉన్న ఆనంద్ కుటుంబ సభ్యులు,బంధువులు, బుధవారం ఉదయం శ్రీ సీతారామచంద్ర స్వామివారి దర్శనం కోసం ఆలయానికి రాగా ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు ఆలయ అర్చకులు అధికారులు. గర్భగుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం శ్రీ లక్ష్మీ తాయారు అమ్మవారి ఆలయం లో వేద పండితుల చేత వేద ఆశీర్వచనం అందించి,స్వామివారి లడ్డు ప్రసాదాన్ని జ్ఞాపికను ఆలయ అర్చకులు అధికారులు అందచేశారు.......

## ఆర్టీసీ మెట్రో టికెట్లు పెంచలేదు

**హైదరాబాద్ పెన్ పవర్:**
సోషల్ మీడియా లో కొందరు తెలంగాణ రాష్ట్ర రోడ్ ట్రాన్స్పోర్ట్ కార్పొరేషన్ (%ు+ూ=ుజ%) మెట్రో ఎక్స్ప్రెస్ సర్వీసు బస్సు టికెట్ ధరలను పెంచింది అని ప్రచారం చేసారు. అందులో ఎలాంటి నిజం లేదని ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ వై.నాగిరెడ్డి వివరణ ఇచ్చారు. ప్రస్తుత అవసరానికి అనుగుణంగా అక్టోబర్ 6, 2025 న గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఆర్టీసీ నడిపే బస్సుల్లో టికెట్లపై ఇన్ఫ్రాస్ట్రక్చర్ సెస్ విధించాం. కానీ ఆ తరవాత, తెలంగాణ లో ఆర్టీసీ నడిపే బస్సుల్లో ఎలాంటి టికెట్ ధరలను పెంచలేదని అన్నారు.

## 28 ఏండ్లు దాటితే నో హాస్టల్.. అడ్మిషన్లను నిరాకరిస్తున్న ఉస్మానియా యూనివర్సిటీ అధికారులు

**హైదరాబాద్ పెన్ పవర్:** శతాధిక వసంతాల ఘన చరిత్ర కలిగిన ఉస్మానియా యూనివర్సిటీ (ఓయూ) ప్రతిష్ట అధికారుల అసమంజస నిర్ణయాలతో మసకబారుతున్నది. వందేమాతరం ఉద్యమం మొదలుకుని ఎన్నో సామాజిక ఉద్యమాలు, ప్రాంతీయ ఉద్యమాలకు వేదికగా నిలిచిన ఓయూను నిర్వీర్యం చేసేందుకు కుట్రలు జరుగుతున్నాయి. 28 ఏండ్ల వయసు దాటిన పీజీ విద్యార్థులకు హాస్టల్‌లో అడ్మిషన్లు నిరాకరిస్తుండటమే ఇందుకు తాజా నిదర్శనం. ఈ తుగ్లక్ నిర్ణయాన్ని విద్యార్థి సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నప్పటికీ అధికారులు మాత్రం కాకమ్మ కబుర్లు చెబుతూ దాటవేస్తున్నారు. దీనిపై విద్యార్థుల్లో తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి.

నోటిఫికేషన్ జారీ సమయంలో లేని నిబంధన ఇప్పుడెందుకో?
రాష్ట్రవ్యాప్తంగా పీజీ అడ్మిషన్లకు నిర్వహించే సీపీజీఈటీ నోటిఫికేషన్ జారీ సమయంలో హాస్టల్ ప్రవేశాలకు సంబంధించి ఎలాంటి నిబంధనలను పేర్కొనలేదు. కనీసం కౌన్సెలింగ్ సమయంలో కూడా నిబంధనలను వెల్లడించలేదు. తీరా మూడు దశల కౌన్సెలింగ్ పూర్తయ్యాక 28 ఏండ్లు దాటిన వారికి హాస్టల్ వసతి కల్పించబోమని అధికారులు చెప్తున్నారు. రాష్ట్రంలోని ఏ ఇతర యూనివర్సిటీల్లోనూ లేని ఈ నిబంధన ఓయూలో ఎందుకని విద్యార్థులు ప్రశ్నిస్తున్నారు. దీని గురించి ముందే చెబితే తాము ఇతర యూనివర్సిటీల్లో చేరేవారమని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**పేద విద్యార్థులకు శరాఘాతం**

ఉన్నత చదువుల కోసం సాధారణంగా ఓయూకు వచ్చేది గ్రామీణ, నిరుపేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులే. వారిలో చాలా మంది కుటుంబ ఆర్థిక పరిస్థితులు సరిగా లేక, ఇతర కారణాల వల్ల పాఠశాల స్థాయి విద్యాభ్యాసం ఆలస్యంగా మొదలవుతుంది. కొందరు 20 ఏండ్ల వయసు దాటిన తర్వాత పదవ తరగతి ఉత్తీర్ణులవుతుంటారు. ఓయూలో ఎప్పటికైనా ఉన్నత చదువులు చదవాలన్న లక్ష్యంతో కష్టపడి సీటు సంపాదించి వచ్చిన విద్యార్థులకు వర్సిటీ అధికారుల సంకుచిత ధోరణి శరాఘాతంగా మారనున్నది.హాస్టల్ ప్రవేశాల కోసం ఓయూ అధికారులను సంప్రదిస్తున్న ఎంతో మంది విద్యార్థులకు నిరాశే ఎదురవుతున్నది. వయోపరిమితి నిబంధనను వెబ్‌సైట్‌లో అధికారికంగా ప్రకటించకుండా కేవలం తమ వద్దకు వచ్చిన వారికే సంబంధిత ఉత్తర్వులు చూపెడుతున్నట్టు సమాచారం. మరికొందరు విద్యార్థులకు కనీసం జవాబు కూడా ఇవ్వడం లేదని తెలిసింది.

**పలు నిర్ణయాలు వివాదాస్పదం**

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఓయూ అధికారులు తీసుకుంటున్న నిర్ణయాలు తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి. ఓయూ పరిధిలో అన్ని రకాల సభలు, సమావేశాలు, ఆందోళనలు, నిరసనలను నిషేధిస్తూ ఈ ఏడాది ఆరంభంలో సర్క్యులర్ జారీ చేశారు. ఈ చర్యను రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, విద్యార్థి సంఘాలు తీవ్రంగా ఖండించాయి. కొన్ని నెలల పాటు ఆందోళనలు కొనసాగాయి. ఆ తర్వాత వర్సిటీలోని అన్ని కళాశాలలు, విభాగాల్లో నిర్వహించే అధికారిక సదస్సులకు తమ అనుమతి లేకుండా అతిథులను ఆహ్వానించకూడదని, పోస్టర్ రూపొందించే ముందే అనుమతి తీసుకోవాలని మరో సర్క్యులర్ జారీ చేశారు. దీనిపై ప్రొఫెసర్లు, మేధావులు, విద్యావేత్తలు తీవ్రంగా మండిపడ్డారు.

# సింగరేణి డిపెండెంట్ ఉద్యోగాల విషయంలో కాంగ్రెస్ ద్రోహ వైఖరి

- **129 మంది అన్ ఫిట్ కోసం పెట్టుకుంటే 23 మందికే ఆమోదం**
- **కార్మికులకు ద్రోహం చేసే నైజాన్ని బయటపెట్టుకున్న ప్రభుత్వం**
- **ఎట్టి పరిస్థితుల్లో దీనికి అంగీకరించం. అందరికీ కోరుకున్నట్లు న్యాయం చేయాలి**
- **లేదంటే ప్రజా పోరాటాల ద్వారానే మీకు బుద్ధి చెప్తాం.**
- **జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత**



**హైదరాబాద్ పెన్ పవర్:**
సింగరేణి లో డిపెండెంట్ ఉద్యోగాలు పోకుండా ఉండేందుకు తెలంగాణ జాగృతి, హెచ్ఎంఎస్ పోరాటం చేశాయి. ఫలితంగా కాంగ్రెస్ ప్రభుత్వం మెడికల్ బోర్డు పెట్టింది. కానీ కార్మికులకు ద్రోహం చేసే తన నైజాన్ని బయటపెట్టుకుందని కవిత ఆరోపించారు. మొత్తం 129 మంది తాము రిటైర్ అయి తమ పిల్లలు, కావాల్సిన వారికి ఉద్యోగం ఇప్పించాలనుకున్నారు. సింగరేణి లో యువరక్తాన్ని ఉండేలా ప్రయత్నం చేశారు. తద్వారా తమ కుటుంబం బాగుంటుందని భావించారు. కానీ మొత్తం 129 మంది లో 23 మందిని మాత్రమే అన్ ఫిట్ గా గుర్తించారు. మిగతా వారందరినీ అండర్ గ్రౌండ్ నుంచి సర్ ఫేస్ కు తెచ్చారు. దాంట్లో కూడా సీనియారిటీ పాటించలేదు. వారిని పదిమందిలో ఒకరిగా చేశారు. అసలు మేము పనిచేసే పరిస్థితిలో లేమని వారు చెబుతుంటే 23 మందిని మాత్రమే అన్ ఫిట్ చేశారు. ఎట్టి పరిస్థితుల్లో దీనికి మేము అంగీకరించమని అన్నారు.

గతంలో మేము ఉన్నప్పుడు అధికారులను ఒప్పించి 85 శాతం వరకు అన్ ఫిట్ చేయించేది. మిగతా వారిని కూడా మళ్లీ మళ్లీ మెడికల్ బోర్డు కు తీసుకొచ్చి అన్ ఫిట్ అయ్యేలా కృషి చేశాం. సింగరేణి సంస్థ కొనసాగాలి. సంస్థలో డిపెండెంట్ ఉద్యోగాలు ఉండాలి అనే ఉద్దేశంతో చేశాం. నడుములు పోయేదాక సింగరేణి కోసం పనిచేసిన కార్మికుని బిడ్డలకు భరోసా ఉండాలని కృషి చేశాం. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఆ స్పిరిట్ ను తుంగలో తొక్కింది. ఆ అంశాలే లేకుండా, సింగరేణి మీద కనీసం ప్రేమ లేకుండా 18 శాతం మందికే అన్ ఫిట్ చేయటమంటే ఇది చాలా అన్యాయం. రోడ్ల మీద పడి పోరాటం చేసే దాకా మెడికల్ బోర్డును పెట్టరు. పెట్టిన తర్వాత దొడ్డి దారిన అన్యాయం చేయటం సరికాదని అన్నారు.

అన్ ఫిట్ కాదని మీరు ఎవరినైతే 84 మందిని సర్ ఫేస్ లో వేశారో వాళ్లంతా కూడా అన్ ఫిట్ కావాలని కోరుకున్నారు. వారందరినీ కూడా అన్ ఫిట్ చేయాలని కోరుతున్నాం. గతంలో కూడా 54 మందితో మెడికల్ బోర్డు పెట్టారు. అందులో తీవ్రమైన అన్యాయం చేస్తూ నలుగురిని మాత్రమే అన్ ఫిట్ చేశారు. ఆ 50 మందిని ఎందుకు మెడికల్ బోర్డుకు పిలవలేదు? తక్షణమే వాళ్లను కూడా పిలవాలని అన్నారు.

ఎవరైతే వాళ్ల పిల్లలకు ఉద్యోగాలు ఇవ్వాలని భావిస్తున్నారో వాటిని ఇవ్వటమే ప్రధాన లక్ష్యంగా పనిచేయాలి. కానీ ఆ ఉద్యోగాలను ఇవ్వకుండా ఆపేందుకు ఈ ప్రభుత్వం పనిచేస్తోంది. ఈ వైఖరిని తీవ్రంగా ఖండిస్తున్నాం. మీరు మారకపోతే మళ్లీ ప్రజాపోరాటలతో మీకు బుద్ధి చెప్తామని హెచ్చరించారు.

# బీఆర్ఎస్ నేతలపై మంత్రి సీతక్క ఫైర్



**హైదరాబాద్ పెన్ పవర్:**ఇందిరమ్మ చీరలపై బీఆర్ఎస్ లీడర్ల దుష్ప్రచారం తగదని మంత్రి సీతక్క మండిపడ్డారు. ఆడబిడ్డలు, మహిళా సంఘాలు ఎంపిక చేసుకున్న డిజైన్లలోనే చీరలని ఇస్తున్నాం. అయినా కలర్ బాగాలేదని, డిజైన్ బాగాలేదని బీఆర్ఎస్ నేతలు విమర్శిస్తున్నారు . సహజంగానే ఆడవాళ్లు ఎదుగుతుంటే ఓర్వలేనితనం కేటీఆర్ హరీష్ రావులది. ఆడబిడ్డలు చీరలు తీసుకుని సంబరపడుతుంటే అవి వారి కళ్ళకు కనిపించడం లేదు.. వారు సంతోషంగా ఉంటే కళ్ళల్లో నిప్పులు పోసుకుంటున్నారని అన్నారు. బీఆర్ఎస్లాగా ఇవి సూరత్ నుంచి కిలోల లెక్కన తీసుకొచ్చిన చీరలు కాదు..సిరిసిల్ల నేతన్నలు తమ చేతితో స్వయంగా నేసిన చీరలు.. కావాలంటే కేటీఆర్, హరీష్ రావు, కవిత స్వయంగా సిరిసిల్ల వెళ్లి నేతన్నలను వెళ్లి అడగవచ్చు కొందరు బీఆర్ఎస్ కార్యకర్తలు, నేతలు కావాలని చీరలు బాగా లేవంటూ మాట్లాడటం సిరిసిల్ల నేతన్నలని అవమానించేలా ఉన్నాయి. చీరల్ని కొందరికే, మహిళా సంఘాల వారికే ఇస్తున్నామని ఆరోపణలు చేస్తున్నారు. మహిళా సంఘాల సభ్యులకు ఇస్తూనే సభ్యత్వం లేని వారిని సైతం సంఘంలోకి ఆహ్వానిస్తూ వారికి సారె పెడుతున్నాం. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల కోసం ఏం చేసినా బీఆర్ఎస్ నేతలు ఓర్చుకోవడం లేదు. ఫ్రీ బస్సు పెడితే బ్రేక్ డాన్స్ చేసుకోవాలని, కొట్టుకుంటున్నారని దుష్ప్రచారం చేశారు.

బీఆర్ఎస్ నేతలు ఇకనైనా తమ బుద్ధి మార్చుకుంటే మంచిది.. మహిళలకు మంచి జరుగుతుంటే స్వాగతించడం సంతోషించడం నేర్చుకోండని అన్నారు.

# రిజర్వేషన్‌లపై కేటీఆర్.. ఓ రేంజ్‌లో ఏకేశారుగా!



**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణలో పంచాయతీ ఎన్నికల సమరానికి ఎన్నికల సంఘం తెరదీసిన విషయం తెలిసిందే. మొత్తం మూడు విడతల్లో ఈ ఎన్నికలు జరగనున్నాయి. దీనికి సంబంధించిన షెడ్యూల్‌ను కూడా ఎన్నికల సంఘం విడుదల చేసింది. అయితే.. రిజర్వేషన్ల విషయంపై రాజకీయ దుమారం రేగింది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు ప్రభుత్వం ప్రయత్నించిన విషయం తెలిసిందే. కుల గణన చేపట్టి.. తద్వారా రాష్ట్రంలో బీసీలు ఎక్కువగా ఉన్నారని గుర్తించింది.

ఈ నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని నిర్ణయించారు. కానీ, ఇటు పాలన పరంగా ఎలా ఉన్నా.. అటు న్యాయపరంగా ఇబ్బందులు వచ్చాయి. ఇక, దీనికి రాష్ట్రపతి, గవర్నర్‌ల నుంచి ఎలాంటి ఆమోదం పొందలేదు. ఈ క్రమంలోనే పంచాయతీ ఎన్నికలను ఒక దఫా వాయిదా వేశారు. కానీ, మరోసారి వీటిని వాయిదా వేసే పరిస్థితిలేదు. అలా చేస్తే.. నిధులు గల్లంతవుతాయి. ఈ నేపథ్యంలోనే ఎన్నికలకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

అయితే.. ఇప్పుడు షెడ్యూల్ ఇచ్చినా.. పాత రిజర్వేషన్ల ప్రకారమే ఎన్నికలు నిర్వహించనున్నారు. అంటే.. మొత్తంగా 50 శాతానికి మించకుండానే రిజర్వేషన్లు అమలు కానున్నాయి. ఈ విషయాన్ని ప్రస్తావించిన బీఆర్ఎస్ నాయకుడు, మాజీ మంత్రి కేటీఆర్.. ప్రభుత్వంపై ఓ రేంజ్‌లో విరుచుకుపడ్డారు. ఆర్భాటంగా చేపట్టిన కులగణన, ఆ తర్వాత బీసీలకు అనుకూలంగా రిజర్వేషన్ కల్పిస్తూ.. ఆమోదించిన బిల్లు ఏమైందని ఆయన ప్రశ్నించారు. అదేసమయంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపైనా విమర్శలు గుప్పించారు. "బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామన్నారు. ఈ క్రమంలోనే కుల గణన చేపట్టారు. దీనికి ప్రజా ధనాన్ని 160 కోట్ల రూపాయల వరకు ఖర్చు చేశారు. కానీ పంచాయతీ ఎన్నికల్లో బీసీలకు కేవలం 17 శాతం రిజర్వేషన్లకు పరిమితం చేస్తున్నారు. గతంలో మేం 24 శాతం అమలు చేస్తే.. ఇప్పుడు వారిని 17 శాతానికి పరిమితం చేశారు. ఇదేనా.. మీరు చేసేది?%--% అని ప్రశ్నించారు. దీనిపై రాహుల్ గాంధీ స్పందించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

# కల్వకుంట్ల కవిత సస్పెన్షన్ నుంచి.. బహిష్కరణ తప్పదా?




**హైదరాబాద్ పెన్ పవర్:**ఇప్పటి వరకూ ఉన్న అంచనాలు వేరు. ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలను చూస్తుంటే తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితను తిరిగి పార్టీలోకి చేర్చుకునే అవకాశం కనిపించడం లేదు. కొంత కాలం క్రితం హరీశ్ రావు, సంతోష్ రావుల పై విమర్శలు చేసిన తర్వాత బీఆర్ఎస్ నాయకత్వం ఆమెను పార్టీ నుంచి సస్పెండ్ మాత్రమే చేసింది. సస్పెన్షన్ ఎత్తివేస్తారని, తిరిగి కల్వకుంట్ల కవితను పార్టీలోకి చేర్చుకునే అవకాశాలుంటాయన్న అంచనాలున్నాయి. కానీ రాను రాను ఆమెపై సస్పెన్షన్ మాత్రమే కాదు.. ఏకంగా పార్టీ నుంచి బహిష్కరించే ఆలోచనలో పార్టీ నాయకత్వం ఉన్నట్లు కనిపిస్తుంది. అందుకే పార్టీ నేతలు కూడా కవితపై అలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారు.

**పార్టీ అధినేత కుమార్తెగా...**

సాధారణంగా రాజకీయాల్లో ఎప్పుడు ఏం జరుగుతుందో చెప్పలేం. అందులోనూ ప్రాంతీయ పార్టీల్లో కుటుంబ రాజకీయాలు ఎక్కువగా ఉంటాయి. కుటుంబ సభ్యుల పెత్తనమే ఎక్కువగా ఉంటుంది. బీఆర్ఎస్ లో కేసీఆర్ కుమారుడు కేటీఆర్, కుమార్తె కవితలు కేసీఆర్ తర్వాత స్థానాల్లో సహజంగా ఉంటారు. కవితపై సస్పెన్షన్ వేటు వేసినా భవిష్యత్ లో ఎన్నికలకు ముందు అయినా ఆమెపై విధించిన సస్పెన్షన్ ఎత్తివేసే అవకాశాలున్నాయి. అదే అందరూ అంచనా వేశారు. గతంలో మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డి పై విమర్శలు చేసిన సమయంలోనూ ఆయన కవితపై విమర్శలు చేయడంలో కొంత జాగ్రత్తలు పాటించారు. ఆమెపై దూషణ భూషణలకు దిగలేదు. కవిత తనపై విమర్శలు చేసిన వాటికి మాత్రమే సమాధానాలిచ్చారు.

**లిక్కర్ రాణి అంటూ...**

కానీ ఇప్పుడు మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి మాత్రం కల్వకుంట్ల కవిత పై చేసిన విమర్శలు చూస్తుంటే ఖచ్చితంగా పార్టీ నాయకత్వం నుంచి వచ్చిన ఆదేశాల మేరకు ఆయన వ్యాఖ్యానించినట్లు తెలిసింది. ఎందుకంటే నిరంజన్ రెడ్డి ఏకంగా కల్వకుంట్ల కవితను లిక్కర్ రాణి అని సంబోధించారంటే కవితకు ఇక బీఆర్ఎస్ లోకి నో ఎంట్రీ అని చెప్పవచ్చన్నది పార్టీ కింది స్థాయి కార్యకర్తల నుంచి వినిపిస్తున్న మాట. పార్టీ అధినేత కుమార్తెను అంత ధైర్యంగా లిక్కర్ రాణి అని అన్నారంటే ఖచ్చితంగా తెలంగాణ భవన్ నుంచి లేదా ఎర్రవెల్లి ఫాం హౌస్ నుంచి వచ్చిన ఆదేశాలనే నమ్మాలి. అందుకే బీఆర్ఎస్ లోకి ఇక కల్వకుంట్ల కవిత ఎంట్రీ అనేది చాలా కష్టమన్న అభిప్రాయం పార్టీ కార్యకర్తల్లో వ్యక్తమవుతుంది. పార్టీ నుంచి ఆమెను బహిష్కరిస్తున్నట్లు త్వరలోనే ఒక ప్రకటన వెలువడే అవకాశాన్ని కొట్టిపారేయలేమన్నది ముఖ్య నేతల అభిప్రాయంగా తెలుస్తుంది.